


www.jananinadam.com

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Adilabad, Asifabad & Hyderabad.


ఎడిటర్ జాధవ్ రోహిదాస్ | సంపుటి : 1 సంచిక:257 | గురువారం 20-03- 2025 | పేజీలు: 6 వెల: రూ.3.00

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జననినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460



- పంచాయతీరాజ్ శాఖ- రూ.31,605 కోట్లు
- వ్యవసాయశాఖ- రూ.24,439 కోట్లు
- విద్యాశాఖ- రూ.23,108కోట్లు
- మహిళా శిశుసంక్షేమశాఖ- రూ.2,862 కోట్లు
- పశు సంవర్ధకశాఖ- రూ.1,674 కోట్లు
- పౌరసరఫరాల శాఖ- రూ.5,734కోట్లు
- కార్మికశాఖ- రూ.900 కోట్లు
- ఎస్సీ సంక్షేమం: రూ40,232 కోట్లు
- ఎస్టీ సంక్షేమం- రూ.17,169 కోట్లు
- బీసీ సంక్షేమం- 11,405 కోట్లు
- చేనేత రంగానికి- రూ.371 కోట్లు
- మైనార్టీ సంక్షేమశాఖ- రూ.3,591 కోట్లు
- పరిశ్రమలశాఖ- రూ.3,527 కోట్లు
- ఐటీ రంగం- రూ.774 కోట్లు
- విద్యుత్ రంగం- రూ.21,221 కోట్లు
- వైద్య రంగం- రూ.12,393 కోట్లు
- పురపాలక రంగం- రూ.17,677 కోట్లు
- నీటి పారుదలశాఖ- రూ.23,373 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖ- రూ.5,907 కోట్లు
- పర్యాటక రంగం- రూ.775 కోట్లు
- క్రీడలు- రూ.465 కోట్లు
- అటవీ, పర్యావరణం- రూ.1,023 కోట్లు
- దేవాదాయశాఖ- రూ.190 కోట్లు

### రూ.3,04,965 కోట్లతో..

# తెలంగాణ బడ్జెట్

2వ పేజీలో...

హైదరాబాద్, మార్చి 19, : తెలంగాణ వార్షిక బడ్జెట్ 2025-26కి కేబినెట్ ఆమోదం తెలపగా.. అసెంబ్లీలో డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇదే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కావడం విశేషం. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యంగా, అంతఃకరణ శుద్ధితో ముందుకు వెళ్తున్నామని భట్టి తెలిపారు. 2025-26 ఏడాదికి రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను సభకు సమర్పిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా పేర్కొన్నారు. 'సంక్షేమం, అభివృద్ధి ఈ ప్రభుత్వానికి జోడు గుర్రాలు.. అంబేడ్కర్ సూచించిన నైతిక విలువలు పాటిస్తూ ప్రజాపాలన సాగిస్తున్నాం. నిరాధార ఆరోపణలు చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సవాళ్లను అదిగమించాం' అని అన్నారు. ఇక ఈ బడ్జెట్ లో వ్యవసాయానికి రూ.24 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారు.. బడ్జెట్ లో అగ్రపీఠం ఎస్సీ సంక్షేమానికి దక్కింది. ఈ బడ్జటె లో వారి సంక్షేమం కోసం ఏకంగా 40 వేల కోట్లు కేటాయించారు. పంచాయితీ రాజ్ శాఖకు రూ.31,605 కోట్లు కేటాయించారు.. విద్య శాఖకు రూ.23,108 కోట్లు దక్కాయి. ఇక ఎస్టీ సంక్షేమానికి రూ.17,169 కోట్లు, బీసీ సంక్షేమం- 11,405 కోట్లు ఈ ఏడాది ఖర్చు చేయనున్నారు..



### అంతరిక్ష నడకలో సునీతా విలియమ్స్

# రికార్డు

ఢిల్లీ,:సునీతా విలియమ్స్ ప్రపంచంలో మారుమ్రోగి పోతున్న పేరు. ఆమె వయస్సు 59. తండ్రి భారతదేశం లోని గుజరాత్‌లో మెహ్సానా జిల్లాలోని ఝులసాన్ నివాసి. తండ్రి దీపక్ పాండే. తల్లి స్లోవేనియన్ ఉరుసిలాన్ బోని. భర్త మైఖేల్ విలియమ్స్, మాజీ ఫెడరల్ మార్షల్ గా ఉన్నారు. ఆమె అమెరికా నేవీలో అధికారిగా ప్రారంభించారు. 1998లో నాసాలో చేరారు. మొదటి అంతరిక్ష ప్రయాణం డిసెంబర్ 2006లో స్పేస్ షటిల్ డిస్కవరీలో జరిగింది. రెండవ ప్రయాణం జూలై 2012లో జరిగింది.

2వ పేజీలో...



### టీ కాంగ్రెస్ లో

# మీనాక్షి మార్క్...

### ఒక్కటిగా ప్రతిపక్షాలకు చుక్కలు

హైదరాబాద్, మార్చి 19,: తెలంగాణ కాంగ్రెస్ అంటేనే తలోదారి అనే చర్చ ఉంటుంది. కానీ హస్తం పార్టీలో సడెస్ ఛేంజెస్ కనిపిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఎవరికి వారే అన్నట్లు వ్యవహరించిన మంత్రులు..రూట్ మార్చినట్లు టాక్ వినిపిస్తోంది. మంత్రివర్గంలో విభేదాలున్నాయని, సీఎం రేవంత్ రెడ్డికి కొందరు మంత్రులకు పడటం లేదన్న చర్చ ఉండేది.

2వ పేజీలో...



### రాష్ట్రంలో పంటలు ఎండటానికి ఈ సన్నాసి ప్రభుత్వమే

# కారణం

### మీడియా పాయింట్లో

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,: ఎండిన వరి పంటతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ఆవరణలో ఆందోళన చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాపం రైతన్నలకు శాపం అంటూ నినా దాలు చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అందాల పోటీలా అంటూ నినదించారు. ఆ తర్వాత మీడియా పాయింట్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లా డారు. రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండుతున్నయంటే అందుకు ముందు చూపులేని ఈ సన్నాసి ప్రభుత్వం, మూర?పు ప్రభుత్వమే కారణమని అన్నారు. లక్షల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయంటే దానికి కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఎండల వలన పంట లు ఎండిపోతున్నాయని ముఖ్య మంత్రి చేతగాని మాటలు చెబుతు న్నాడని, అందుకు ముమ్మాటికి కారణం రేవంత్ రెడ్డేనని విమర్శిం చారు.రేవంత్ రెడ్డి చేతగానితనం, తెలివి లేని తనం, సాగునీటి నిర్వహణ ప్రాజెక్టుల నిర్వహణ చేయలేని తనం వల్లనే పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు.

హైదరాబాద్,మార్చి19: ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో అసెంబ్లీ కమిటీ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఎస్సీ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపాయి. వర్గీకరణ పోరాటంలో అమరులైన వారికి నివాళిగా 2 నిముషాలు మౌనం పాటించారు సీఎం, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రికి మాదిగ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలిపారు.



### ఎస్సీవర్గీకరణకు అసెంబ్లీ

# ఆమోదం

**సిఎం రేవంత్‌ను సన్మానించిన మాదిగ సంఘాలు**

**సుప్రీం తీర్పును తొలిసారిగా అమలు చేసిందే తెలంగాణ**

**సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

2వ పేజీలో...



### ఎవరికి నచ్చినా నచ్చకపోయినా.. టారిఫ్‌ల విధింపు

# వాస్తవమే

### కేంద్ర విదేశాంగ మంత్రి

**ఢిల్లీ,:**విదేశాలపై టారిఫ్‌లు, ఆంక్షల విధింపునకు సంబంధించి కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా ఆ నిర్ణయాలు నిజమేనని చెప్పారు. శక్తిమంతమైన దేశంగా మారే క్రమంలో వాణిజ్య సంబంధాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రైసీనా డైలాగ్ 2025లో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ దేశాలపై సుంకాలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వాణిజ్య పరిమితులు, టారిఫ్‌లు, ఆంక్షలు వంటి వాటికి భారత విదేశాంగ విధానంలో చోటుందా..? అని కేంద్ర మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి బదులిస్తూ.. 'మీరు నమ్మినా నమ్మకపోయినా.. సుంకాలు, ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలుచేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని గమనించినట్లయితే.. గొప్ప ఆయుధీకరణను చూశాం. ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం. ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం. ఓ దేశం సమగ్ర జాతీయశక్తిగా ఎదిగే పోరాటానికి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారాన్ని అందిస్తాయి. అందుకే వాణిజ్య, వ్యాపార సంబంధాల కోసం దేశాలు పోటీపడుతు న్నాయి.' అన్నారు.ఈ సందర్భంగా అంతర్జాతీయ సంబంధా లను జైశంకర్ ప్రస్తావించారు. దశాబ్దం క్రితంతో పోలిస్తే నేడు అంతర్జాతీయ సంబంధాల్లో నియంతృత్వ ధోరణి తగ్గిందనే భావిస్తున్నానని అన్నారు. నేడు చాలా వరకు విభజన రేఖలు చెరిగిపోయాయని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు. భారత్‌పై అమెరికా సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చిన నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ అత్యధిక స్థాయిలో సుంకాలు విధిస్తోందని ట్రంప్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఆయన యూఎస్ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ.. ఏప్రిల్ 2 నుంచి భారత్ సహా పలు దేశాలపై పరస్పర సుంకాలు అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. దీనిపై వెనక్కి తగ్గే అవకాశమే లేదని చెప్పారు.

# బడ్జెట్ ప్రసంగమా..?

# రాజకీయ ప్రసంగమా..?

హైదరాబాద్: దక్షతతో, బాధ్యతగా హామీలు ఇచ్చాం, నెరవేర్చడం మాకు కష్టం కాదు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల మీద ఉప ము ఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. ఒక్క ఏడాది నోరు కట్టుకుంటే అన్ని హామీలు నెరవే రుస్తాం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఒక మధ్యంతర బడ్జెట్ తో కలిపి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్నది మూడో బడ్జెట్. అజ్ఞానం, అనుభ వరాహిత్యం, అహంకారం వెరసి తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్న పాలన అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. రెండేళ్ల పాలన పూర్తి కాక ముందే తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు .. 2050 తెలంగాణ రైజింగ్ ప్రణాళిక తయారు చేస్తున్నాం అని చెప్పడం హాస్యాస్పదం కేసీఆర్ నాయకత్వం లో పదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో జిల్లాలు, రెవిన్యూ డివిజన్లు, కొత్త మండలాల ఏర్పాటుతో పాలన వికేంద్రీకరించబడింది పదేళ్ల కేసీ ఆర్ పాలనలో విధ్వంసం మూలంగానే తెలంగాణ తలసరి ఆదాయంలో, తలసరి విద్యుత్ వినియోగంలో నంబర్ వన్ గా నిలిచిందా ?



2వ పేజీలో...

- అసెంబ్లీ సాక్షిగా అబద్దాల చిట్టా చదివారు
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనా వికాసాన్ని15 నెలల కాంగ్రెస్ పాలనలో విధ్వంసం చేశారు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

# టీ కాంగ్రెస్ లో మీనాక్షి మార్క్...



క్యాబినెట్‌లో కొంతమంది మంత్రులు తనకు సహకరించడం లేదని పార్టీ అంతర్గత సమావేశాల్లో స్వయంగా రేవంత్ రెడ్డి వాపోయిన సందర్భాలున్నాయి.ఇలా మంత్రివర్గంలో గ్యాప్..అసెంబ్లీలోనూ కొట్టొచ్చినట్లు కనిపించేంది. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు, ఆరోపణలతో దాడికి దిగినా..మంత్రులు పెద్దగా పట్టనట్లు ఉంటూ వచ్చారు. తమ తమ శాఖలకు సంబంధించిన అంశం వస్తే తప్ప మిగతా సందర్భాల్లో పెద్దగా రెస్పాండ్ అయ్యే వారు కాదు. ప్రతీ దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పుకోవాల్సి వచ్చేది.ఇప్పుడు బడ్జెట్ సమావేశాలను గమనిస్తే పరిస్థితిలో మార్పు వచ్చినట్లు చర్చ జరుగుతోంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్‌లో చాలా ఛేంజెస్ వచ్చాయన్న టాక్ వినిపిస్తోంది. స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యల విషయంలో ఇది స్పష్టంగా కనిపించింది. సభలో ఉన్న మంత్రులు, ఇతర సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి స్పీడ్‌గా నిర్ణయాలు తీసుకున్నారు.ఆ తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సమయంలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శలకు అధికార పక్షం నుంచి దీటుగానే సమాధానం వచ్చింది. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలేవీ చేయడం లేదన్న బీఆర్ఎస్ విమర్శలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సుధీర్ఘంగా సమాధానం ఇచ్చి బీఆర్ఎస్‌ను

మొదటిపేజీ తరువాయి...

సైలెంట్ చేసే ప్రయత్నం చేశారు.ఇక మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా బీఆర్ఎస్ విమర్శలకు దీటుగా సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. బీసీ కులగణనపై ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టారు. ఇక కృష్ణా జలాల వివాదంపై ప్రతిపక్షాల విమర్శలపై కూడా సీరియస్ గానే రియాక్ట్ అయ్యారు ఉత్తమ్. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటే కేసీఆర్, హరీష్ రావులే కారణమని ఆరోపించారు. పులిచింతల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం లేదని చెప్పుకొచ్చారు ఉత్తమ్ కుమార్ రెడ్డి.రెండు మూడు రోజులుగా అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ పక్షం పైచేయి సాధించే పనిలో పడింది. అసెంబ్లీలో అధికార పార్టీ టీమ్ వర్క్ మొదలైందన్న మాటలు వినిపిస్తున్నాయి. పార్టీలో ఇది మంచి పరిణామమని చర్చించుకుంటున్నారు నేతలు. అయితే ఇందుకు ఢిల్లీ పెద్దల డైరెక్షనే కారణని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అసెంబ్లీలో ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య కోఆర్డినేషన్ మిస్ అవుతుందని కాంగ్రెస్ హైకమాండ్ గుర్తించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సీఎంకు, మంత్రులకు మనస్పర్థలు, విభేదాలుంటే అంతర్గతంగా మాట్లాడుకోవాలని, కానీ ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చేలా ప్రవర్తించొద్దని గట్టిగానే చెప్పినట్లు సమాచారం.అసెంబ్లీలో పక్కా కోఆర్డినేషన్‌తో కలిసికట్టుగా ప్రతిపక్షాలను ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేసినట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రస్తుత బడ్జెట్ సెషన్‌లో అధికార కాంగ్రెస్ పక్షంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోందట. హైకమాండ్ ఉపదేశం బాగానే పనిచేస్తోందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

# రూ.3,04,965 కోట్లతో తెలంగాణ బడ్జెట్

మొదటిపేజీ తరువాయి...

డిప్యూటీ సీఎం శాసన సభలో రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు. 'రైతు భరోసాకు రూ.18000 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్ కు రూ.500 బోనస్, 40 లక్షల ఎకరాల్లో సన్న వడ్లసాగు విస్తరణ. ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య 8,332కు పెంపు, ఆయిల్ ఫామ్ సాగుకు టన్నుకు రూ.2000 అదనపు సబ్సిడీ, వడ్ల బోనస్ కింద రైతులకు రూ.1,206 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. వైద్య కళాశాలలకు భారీగా నిధులు కేటాయించినట్లు భట్టి తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. కొత్తగా 1,835 వైద్య చికిత్సలు ఆరోగ్యశ్రీలో చేర్చినట్లు పేర్కొన్నారు. దీంతో 90 లక్షల పేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ లబ్ధి చేకూరుతుందని, ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ఖర్చును 20 శాతం పెంచామని భట్టి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. 'స్కూల్స్ లో ఐఐటీ–జేఈఈ, నీట్ కోచింగ్ తో పాటు ఉచిత వసతులు. గురుకులాల కోసం డైట్ ఛార్జీలు 40 శాతం కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంపు. విద్యార్థులకు ఉచితంగా సాయంత్రం స్నాక్స్ పథకం. 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కి రూ. 11,600 కోట్లు' కేటాయించినట్లు తెలిపారు.

ఆరు గ్యారంటీలలకు బడ్జెట్లో రూ.56,084 కోట్లని కేటాయించింది. రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు, చేయూత పింఛన్లుకు రూ.14,861 కోట్లు కేటాయించారు. ఇక ఇందిరమ్మ ఇళ్లకు రూ.12,571 కోట్లు, మహాలక్ష్మి (ఆర్టీసీ బస్సు)కి రూ.4,305 కోట్లు కేటాయింపులు చేశారు. గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్) రూ.2,080 కోట్లను కేటాయిస్తున్నట్లు మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు రూ.5,006 కోట్లు ఆదా అయ్యిందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 94 శాతానికి పెరిగిందన్నారు. 'సిలిండర్ల రాయితీ కింద రూ.433 కోట్లు చెల్లించాం. గృహజ్యోతి పథకం కోసం రూ.1,775 కోట్లు రాయితీ ఇచ్చాం. రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 43 లక్షల కుటుంబాలకు, గృహజ్యోతి పథకం ద్వారా 50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరింది' అని భట్టి తెలిపారు.ఆరు గ్యారంటీలకు రూ.56,084 కోట్లు కేటాయింపులు చేసినట్లు మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. చేయూత పింఛన్లకు రూ.14,861 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీకి రూ.1,143 కోట్లు, గ్యాస్ సిలిండర్ రాయితీ కోసం రూ.723 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లు, విద్యుత్ రాయితీ కోసం రూ.11,500 కోట్లు, రాజీవ్ యువ వికాసం కోసం రూ.6 వేల కోట్లు కేటాయించినట్లు భట్టి తెలిపారు.తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి రూ.11,600కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మొదటి విడతలో నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేస్తామని, ఆ స్కూల్స్‌లో ఐఐటీ–జేఈఈ, నీట్ కోచింగ్‌తో పాటు ఉచిత వసతులు కల్పిస్తామని అన్నారు. గురుకులాల కోసం డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచమని వెల్లడించారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క్ అసెంబ్లీలో ప్రకటించారు. రూ.1,511 కోట్లు, %ాణఖీ/ జణూ% ఫండ్స్ రూ. 3, 300 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలందరికీ ఉపాధితో పాటు ఆర్థికంగా బలోపేతం అయ్యే కార్యక్రమాలకు ప్రభుత్వం ఊతమిస్తోందన్నారు.తెలంగాణ రైజింగ్ 2050 ప్రణాళికతో పాలన సాగిస్తున్నామని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ తయారీ చేశామన్నారు. 'రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేశామని, చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం' అని భట్టి తెలిపారు.

# ఎస్సీవర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం

ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేసినందుకు అసెంబ్లీ కమిటీ హాల్ లో సీఎం రేవంత్ కి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. నన్ను ఒక్కడినే కాదు.. రాహుల్ గాంధీని... కేబినెట్ ని అభినందించాలి.. రాహుల్ గాంధీ నేనున్న అని చెప్పడంతో ధైర్యం వచ్చింది.. దామోదర రాజనర్సింహ కేబినెట్ సబ్ కమిటీ– ఛైర్మన్ తీసుకో అంటే నాకు వద్దు అన్నారు.. నా పనే నేను ఎక్కువ చేసుకున్న అనుకుంటారు అని వద్దన్నారు.. 199 పేజీల విశ్లేషణ ఇచ్చారు కమిషన్ ఛైర్మన్. ఇప్పటి వరకు ఉద్యోగాలు రాని.. వర్గాలను కూడా గుర్తించాం.. ఇప్పుడు తొమ్మిది కాదు..పావు తక్కువ పది మీ రిజర్వేషన్. ఇది ఎవరికి వ్యతిరేకం కాదు.. మీకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడం.. నేను ఉన్న కాబట్టి వేగంగా సుప్రీం కోర్టు తీర్పు అమలు చేశా.. నాకు మొదటి నుండి మాదిగ పిల్లలే నా వెంట ఉన్నారని అన్నారు. మీకు సహనం ఎక్కువ.. పదేళ్లు వేచి చూశారు.. నాకు అవకాశం ఇచ్చారు.. సుప్రీం కోర్టులో కేసులు వాయిదా పడుతున్నాయి.. అందుకే నేనే మంచి అడ్వకేట్ నీ పెట్టీ– పంపిన.. మందకృష్ణతో నాకేం విభేదం లేదు.. కానీ ఆయన నా కంటే... కిషన్ రెడ్డిని ఎక్కువ నమ్ముతున్నాడు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా ఇప్పటి వరకు అమలు చేయలేదు.. మీ జాతికి న్యాయం చేయాలని అనుకున్న.. బిల్లుకు ప్రాసెస్ ఉంటది.. అందుకే పకడ్బందీగా చేశాం.బిల్లు

మొదటిపేజీ తరువాయి...

అమల్లోకి వచ్చేంత వరకు నోటిఫికేషన్ ఇవ్వను అని చెప్పినా.. ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు.. పదేళ్లు నాతో జాతి నడుస్తుంది.. పొలం కాదా మీకు.. మాకే కదా సంబంధం.. మార్చిపోతమా.. ఓయూ కి వీసీ ఇచ్చినా.. బాసర ఐఐటీకి వీసీగా మాదిగకు అవకాశం ఇచ్చాం.. ఉస్మానియా ప్రిన్సిపాల్ మాదిగ నీ వేశాం.. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మన అమ్మాయే.. మా వాళ్ళను పక్కన పెట్టీ కూడా మీకు అవకాశం ఇచ్చిన.. మీకు అన్యాయం అయ్యింది అని.. అవకాశం ఇచ్చాం..ఇవాళ్టి తో ఐపోలేదు. నేను ఉన్నంత వరకు మీ వాడే కుర్చీలో ఉన్నాడు అనుకోండి.. నాకు పేరు తప్పా.. ఇంకేం ఆలోచన లేదు.. చిలక్కి చెప్పినట్టు– చెప్పినా.. చింత స్వామి నాకు కాలేజి నుండి తెలుసు.. ఆవేశం తగ్గించి..ఆలోచన పెంచుకోండి. బుడగ జంగాలు ఇండ్లు ఇచ్చే బాధ్యత నాది.. కొంత ఆలస్యం అవ్వచ్చు..ఓపిక గా ఉండండి.. మీరు ఎవ్వరితో కొట్లాడకండి.. మీకేం కావాలో చేయాలో చేయడానికి మేము ఉన్నాం. ఇకపై వరుసగా నోటిఫికేషన్ లు.. పిల్లల్ని చదివించండి.. రాహుల్ గాంధీ కోసం ఓ సభ పెట్టండి.. మీరు ధర్మ యుద్ధం సభ పెట్టినప్పుడు నేను అండగా ఉన్న.. మీరు కూడా అండగా ఉండండి.. అభినందన కంటే గాంధీ కుటు–ంబానికి ఏం కావాలి అని ఉండదు' అని సీఎం రేవంత్ అన్నారు.

## పెనంలో నుంచి పొయ్యిలో పడ్డ జనం

### బడ్జెట్ ఆరు గ్యారెంటీలను విస్మరించింది
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్,మార్చి19: అట్టహాసంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలు ఆశలు వదులుకునేలా పద్దుల రూపకల్పన జరిగిందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్‌పై కిషన్‌రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడీతో తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసిందన్నారు. పదేళ్లపాటు– భారాస రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అగాథంలోకి నెట్టేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు రాష్ట్రాన్ని పెనంపై నుంచి పొయ్యిలోకి పడేసినట్టు చేసింది. గతేడాది బడ్జెట్ పెట్టినప్పుడు తొలి ఏడాదే కదా అని తప్పించుకున్నారు. 15 నెలలు పాలించిన తర్వాత కూడా ఆరు గ్యారంటీ–లు, 420 వాగ్దానాల అమలును పూర్తిగా విస్మరించారు. వివిధ ప్రాజెక్టులకు భారీగా ప్రకటనలు చేసినా..



కేటాయింపులు, ఆచరణ శూన్యమని ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. అంకెల గారడీ ద్వారా మరోసారి తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిన బడ్జెట్ ఇది. ఎన్నికల హామీలపై ప్రజలు ఆశలు వదులుకోవాలని బడ్జెట్ నిరూపించింది. ప్రభుత్వ ఆదాయం, రాబడిపై కనీస అవగాహన లేకుండా అంచనాలు రూపొందించారు' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# రాష్ట్రంలో పంటలు ఎండటానికి ఈ సన్నాసి ప్రభుత్వమే కారణం

మొదటిపేజీ తరువాయి...

రైతుల పట్ల, రైతాంగం పట్ల ప్రభుత్వం తన బాధ్యత మర్చిపోయింది కాబట్టి పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి రూ.25 వేల చొప్పున పంట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతన్నలకు నష్టపరిహారం ఇచ్చేందుకు ఈ బడ్జెట్‌లోనే నిధులను కేటాయించాలన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర ప్రజల తరఫున తాము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఎండిన పంటల అంశానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు రైతులకు అండగా, భరోసాగా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో తమ పార్టీ పర్యటిస్తుందన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల సోయిలేదు, బాధ లేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో 480 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు. కేసీఆర్ మీద కోపంతో మేడిగడ్డను ఎండబెట్టడం వలన రైతన్నలకు ఇబ్బంది అవుతున్నదని చెప్పారు. కాళేశ్వరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక దోపిడీ చేస్తున్నదని, బ్రోకర్లతో కలిసి ఇసుక వ్యాపారం చేస్తున్నదని ఆరోపించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో పూర్తిగా పంటలు ఎండుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడికి చూస్తున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదైనా జలాలను వాడుకునే తెలివి ప్రభుత్వానికి లేదన్నారు. కృష్ణా



జలాలను వాడుకుని కృష్ణా పరివాహక ప్రాంతంలో సమృద్ధిగా పంటలు పండించామని చెప్పారు. గతంలో సాగునీరు అందిన పంటలు కూడా ఇప్పుడు ఎందుకు ఎండిపోతున్నాయని ప్రశ్నించారు. ఈరోజు తెలంగాణ పంటలను, రైతన్నలను ఎండబెడుతున్నది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని ఆరోపించారు. కృష్ణ నీటిని 22% కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాడలేదని, అందుకే పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ విమర్శించారు. రైతన్నలు తమ పంటలను మేకలు, గొర్లకు మేతగా వేసే పరిస్థితి ఉందన్నారు. దేవాదులకు పంపుల నిర్వహణ కోసం రూ.6 కోట్లు ఇవ్వకపోవడం వలన 600 కోట్లకు పైగా నష్టం జరిగిందని చెప్పారు. లక్షల ఎకరాల పంట దెబ్బతిన్నదన్నారు. ఈ దున్నపోతు ప్రభుత్వం మా నాయకులు లేపే దాకా మొద్దు నిద్ర లేవలేదని, దేవాదుల పంపులను పట్టించుకోలేదని విమర్శించారు. అందుకే ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటున్నామని, రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై ద్వేషంతో తెచ్చిన కరువని అన్నారు.

# బడ్జెట్ ప్రసంగమా..? రాజకీయ ప్రసంగమా..?

మొదటిపేజీ తరువాయి...

విద్యారంగం, వైద్యరంగంలో మార్పులు, ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి సదుపాయం మూలంగా పంటల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచింది వాస్తవం కాదా ? పదేళ్లలో పచ్చబడ్డ తెలంగాణను ఎండబెట్టి చోద్యం చూస్తున్నది కాంగ్రెస్. అద్భుతమైన మిషన్ భగీరథ పథకం అమలై ప్రజలు బిందెలు పట్టుకుని వెళ్లే పరిస్థితి లేకుండా మార్చిన తెలంగాణలో మళ్లీ నీటి ఎద్దడితో బిందెలు పట్టుకుని వెళ్లే మంచినీటి కటకట దుస్థితి తెచ్చింది కాంగ్రెస్. పల్లెప్రగతితో పల్లెలు, పట్టణ ప్రగతితో కళకళలాడిన పల్లెలు, పట్టణాలు నేడు పారిశుధ్యం లోపించి కంపుకొడుతున్నాయి. హరితహారం మొక్కలు నీళ్లు పోసే దిక్కు లేక ఎండిపోతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కర్ఫ్యూ పరిస్థితి తీసుకువచ్చిందని అన్నారు. పారిశుద్ధ కార్మికులు, అంగన్వాడీ, ఆశాలు, ప్రభుత్వ ఉద్యోగుల వరకు అన్ని వర్గాలను ఆశల పల్లకిలో ఊరేగించి అధం పాతాళానికి విసిరేసింది కాంగ్రెసని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అని రైతులకు ఆశ చూపి మోసం చేశారు. ఎకరాకు ఏడాదికి రూ.15 వేల రైతుభరోసా అని చెప్పి 15 నెలల పాలనలో రెండు సార్లు ఎగ్గొట్టి రూ.12 వేలకు కుదించి కూడా కనీసం మూడు ఎకరాలు ఉన్న రైతులకు ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు మొదలే పెట్టలేదు .. దానిని అమలు చేస్తున్నాం అని పచ్చి అబద్దాలు చెప్తున్నారు. కౌలు రైతులకు కూడా ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని చెప్పి దాని ఊసెత్తడం లేదు. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ బోగస్ అని తేలిపోయింది .. అసలు రాష్ట్రంలో పంటల కొనుగోలు అన్నదే ప్రహసనంగా మారింది. కాంగ్రెస్ 15 నెలల పాలన పాపం ఫలితంగా 450 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విద్యారంగంలో కాంగ్రెస్ 15 నెలల పాలన విధ్వంసం రేపింది .. గురుకుల పాఠశాలలలో 50 మందికి పైగా విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, కేసీఆర్ పాలనలో పూర్తయిన పరీక్షల ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందించి మేమే ఇచ్చాం అని గొప్పలు చెప్పుకుంటున్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో వెలుగులు మాయమై చీకట్లు అలుముకున్నాయి. కేవలం 15 నెలలలో రూ.లక్ష 58 వేల కోట్లు అప్పులు చేసి ఒక్క పథకం అమలు చేయలేదు .. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. బడ్జెట్ ప్రసంగం నిండా అన్నీ అబద్దాలే వండి వార్చారు. ధ్వంసం, విధ్వంసమే కాంగ్రెస్ రచన .. నవ నిర్మాణాన్ని నరనరాన నింపుకుని పనిచేసిన కేసీఆర్ సర్కార్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని అన్నారు.

# ఉద్యోగులకు వాహనాల పంపిణీ

హైదరాబాద్: నగరానికి చెందిన ముకుంద ఉద్యోగులకు వరాలు అందజేసింది. సంస్థ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 20 మంది ఉద్యోగులకు ద్విచక్ర వాహనాలు, ఇద్దరు ఉద్యోగులకు హై రేంజ్ కారులను అందజేశారు. బేగంపేటలోని కంట్రీ క్లబ్ లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో సంస్థ ఛైర్మన్ నరసింహారెడ్డి ఎండి నికిత రెడ్డిల చేతుల మీదుగా వాహనాలను అందజేశారు. ఉద్యోగులకు ప్రత్యేక ప్రోత్సాహకంగా ఒక నెల వేతనంతో కూడిన చెక్కులను అందజేశారు. అనంతరం ఉద్యోగులందరికీ సంస్థ యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది. ఉద్యోగులు ఛైర్మన్ నరసింహారెడ్డి నీ ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నరసింహ రెడ్డి మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులు లాంటివారని వారిని అన్ని విధాలుగా ఆదుకోవడం లో తమకు ఎంతో ఆనందం ఉంటుందని అన్నారు. అంగరంగ వైభవంగా జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఉద్యోగులు ఆనందంగా ఆడి పాడారు.

## అర్ధరాత్రి మహంకాళి ఆలయంలోకి చొరబడ్డ దుండగులు



శామీర్ పేట్, మార్చి 19 : కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మహంకాళి ఆలయం తాళం, హుండీ విరగొట్టారు. అనంతరం ఆ హుండీలోని డబ్బులు అపహరించుకుపోయిన సంఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శామీర్ పేట్ మండలం అలియాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో చొరబడి హుండీని గుడి బయటకి తీసుకెళ్లి పగలగొట్టారు. అందులోని డబ్బులను ఆపహరించుకుపోయారు. ఆలయం తలుపుల తాళం విరగొట్టి చిన్న చిన్న వస్తువులు దొంగిలించినట్లు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలి

**- పెద్దపల్లి జిల్లా విద్యాధికారి డి మాధవి**



మంథని ప్రతినిధి, మార్చి 19:విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు తగిన కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా విద్యాధికారి డి మాధవి అన్నారు గురువారం మంథని మండలం అరేంద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి మాధవి సందర్శించారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్ష సమయం లో ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సైతం డిఈఓ సందర్శించారు. ఎఫ్ ఎల్ ఎన్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం శ్రీనివాస్ తోపాటు ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంతరిక్ష నడకలో సునీతా విలియమ్స్ రికార్డు

మొదటిపేజీ తరువాయి...

ఇప్పుడు మూడవ ప్రయాణం పూర్తయింది. వారు మూడు అంతరిక్ష కార్యకలాపాలలో మొత్తం 62 గంటల ఆరు నిమిషాలు అంతరిక్షంలో నడిచారు. సునీత నాసా సొంత పెగ్గీ విట్సన్ నెలకొల్పిన రికార్డును అధిగమించారు. పెగ్గీ విట్సన్ రికార్డు 60 గంటల 21 నిమిషాలు. ఈసారి ఆమె ఐదు గంటల 26 నిమిషాలు గడిపిన తర్వాత కొత్త రికార్డును సొంతం చేసుకున్నారు. మూడవ మిషన్‌లో కమాండర్: 10 రోజుల మిషన్‌లో వచ్చిన సునీ తకు అంతరిక్ష కేంద్రం కమాండ్ బాధ్యతలు అప్పగించారు. ఆమె నూట యాభైకి పైగా ప్రయోగాలకు నాయకత్వం వహించారు. అంతరిక్షంలో మానవ శారీరక, మానసిక మార్పులు, సూక్ష్మజీవుల పెరుగుదల మరియు ఉనికి, రోబోటిక్స్, మెటీరియల్ సైన్స్ మొదలైన వి వీటిలో ఉన్నాయి. ప్లాంట్‌లో అతిపెద్ద నిర్వహణ పనులకు సునీత వ్యక్తిగతంగా నాయకత్వం వహించారు. ఒలింపిక్స్ సమయంలో స్టేషన్‌లో మినీఒలింపిక్స్ నిర్వహించబడిందని కూడా గుర్తించబడింది.

# సిబ్బంది సమస్యల పరిష్కారంకే "పోలీస్ దర్బార్"

- విధుల్లో నిర్లక్ష్యం వద్దు... అందరం సమన్వయంతో కలిసి పని చేద్దాం
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి19: రామగుండం కమిషనరేట్ ఏఆర్ సిబ్బంది, అధికారులకు రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝు, బుధవారం అయాన మాట్లాడాతు ఆదేశాల మేరకు కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో "దర్బార్" కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమం కు సీపీ హాజరై ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బంది తో మాట్లాడి సమస్యలను, వినతిలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకొని సమస్యలను వెంటనె పరిష్కరించే విధముగా చూస్తాం అన్నారు. ఏలాంటి సమస్యఉన్న దర్బార్ లో చెప్పడం ఇబ్బందిగాఉంటే ఆఫీస్ కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చు అన్నారు.ఈ సందర్బంగా సీపీ మాట్లాడుతూ....మనమందరం ఒక కుటుంబం. అందరం సమన్వయంతో క్రమ శిక్షణ, ప్రణాళికబద్ధంగా డ్యూటీ లను నిర్వర్తించాలని రామగుండం కమిషనరేట్ కి, తెలంగాణ పోలిస్ మంచిపేరు తీసుకురావాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, మంచిప్రవర్తన తో విధులు నిర్వర్తించినప్పుడు అధికారులు తమ వెంట ఉంటామన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు, ఆదేశాలు చేయడం జరిగింది. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించినట్లైతే, పోలీస్ శాఖ ప్రతిష్ట కి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన శాఖ పరమైన చర్య తీసుకొవడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ మరియు యూనిఫామ్ మీద గౌరవం ఉంటే చట్ట వ్యతిరేకమైన పనుల మీద ఆలోచన రాదు అన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉండాలి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోండి. మానసిక శారీర ఒత్తిడి నుండి దూరం కావచ్చు అన్నారు. వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని కొన్ని సందర్భాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో లో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబ గురించి ఆలోచించాలని సూచించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు నిర్వహించి సిబ్బంది అధికారులు మరియు వారి కుటుంబ సభ్యులకు హెల్త్



# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి19:** జిల్లాలోని ప్రాజెక్టుల క్రింద సాగు చేయబడే చివరి ఆయకట్టు వరకు పంట సాగుకు నీరు అందించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్లో నీటి పారుదల శాఖ ఈ.ఈ.డి,ఈ.ఈ.ఎ.ఈ.ఈ. లతో సాగునీటి నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాజెక్టు పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ 11.4 టి.ఎం.సి. ఉందని, కార్యచరణ ప్రకారం నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. సుందిళ్ళ, అన్నారు, గూడెం ఎత్తిపోతలు, ఇతర మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, నీల్వాయి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జూన్ 15వ తేదీ వరకు జిల్లాలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పంట సాగులో నీటి అవసరం తక్కువగా ఉండే వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహనకల్పించాలని, కెనాల్లు, ట్యాంకులు, చెరువుల శుద్దీకరణ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సిర్సా ఎత్తిపోతల పథకం, అర్జునగుట్ట, కిష్టాపూర్ ప్రాజెక్టులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సాగునీరు, త్రాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా కార్యచరణ అమలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గోన్నారు.

# దివ్యాంగవిద్యార్థులుసహాయ ఉపకరణాలనుసద్వినియోగంచేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**

**జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి19:** దివ్యాంగ విద్యార్థులు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అలింకో స్వచ్ఛంద సంస్థ వారు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు కొరకు సర్వే నిర్వహించడం జరిగిందని, ఈ సర్వేలో 136 మంది విద్యార్థులను గుర్తించి వారికి ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు ఇతర ఉపకరణాలను అందించేందుకు అలింకో సంస్థ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అంగవైకల్యం కలిగిన వారు తమ పనులను తామే స్వయంగా చేసుకోవడానికి ఈ సహాయ ఉపకరణాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.



సమాజంలో దివ్యాంగుల పట్ల చిన్నచూపు లేకుండా వారిని గౌరవించాలని, మనతో సమానంగా ఆదరించాలని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, ఇతర సహాయ ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అలింకో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గౌరవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గోన్నారు.

# ఎస్.ఎస్.సి. వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లతో సిద్దం


**జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య**

**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి19:** జిల్లాలో ఎస్.ఎస్.సి.పరీక్షల నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న ఎస్.ఎస్.సి. పరీక్షల కొరకు జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని,4 వేల 730 మంది బాలురు, 4 వేల 468 మంది బాలికలు, గతంలో అనుత్తీర్ణులైన 221 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోసిట్ పరీక్ష ఉదయం 9.30 గంంఎల నుండి మధ్యాహ్నం 12.50 గంవ ల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంఎల నుండి 11 గంఎల వరకు మినహా మిగతా పరీక్షలు ఉదయం 9.30 గంఎల నుండి మధ్యాహ్నం 12.30 గంఎల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 21న ఫస్ట్ లాంగ్వేజ్, ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్-1, పార్ట్-2, 22న సెకండ్ లాంగ్వేజ్, 24న థర్డ్ లాంగ్వేజ్, 26న మాథమెటిక్స్, 28న సైన్స్ పార్ట్-1 ఫిజికల్ సైన్స్, 29న సైన్స్ పార్ట్-2 బయోలాజికల్ సైన్స్, ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్, 3న ఓ.ఎస్.ఎస్.సి. మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సాన్ట్ అరబిక్), ఎస్.ఎస్.సి. ఒకేషనల్ కోర్స్ (థియరీ), 4న ఓ.ఎస్.ఎస్సి. మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సాట్అరబిక్) పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బఅందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు, పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలు, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేత, పరీక్ష సమయానికి అనుకూలంగా విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు టి.జి.ఎస్.ఆర్.టి.సి. బస్సు సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది నియామకం, అవసరమైన మందులు, ఓ. ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా, పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్యం నిర్వహణ ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని, విద్యార్థులు హాల్ టికెట్లు %bse.telangana.gov.in% వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని, పరీక్షల విషయంలో ఎవరికైనా సందేహాలు ఉంటే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లు 7032463114, 9440688034 లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి19:** విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లాలోని మోతుగూడ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం, నిత్యవసర సరుకుల నాణ్యత, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుద్ధమైన త్రాగునీటితో పాటు నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ 1బందీగా చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు విదల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను మెరుగుపరచాలని, నాణ్యమైన విద్యతోపాటు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, త్రాగునీటిని విద్యార్థులకు అందించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గోన్నారు.



# ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

**రెబ్బెన సీఐ బుద్దె స్వామి**

**పదో తరగతి 50మంది విద్యార్థులకు ప్యాడ్, పెన్, పెన్సిల్, వాటర్ బాటిల్ అందజేత**

**జననినాదం,తిర్యాణి 19:** పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యమని రెబ్బెన సర్కిల్ సీఐ స్వామి అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిర్యాణి చెలిమెల బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సీఐ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష రాసే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ బుద్దె స్వామి మాట్లాడుతూ..కృషి తపన పట్టుదల సమయ పాలన విజయానికి ముఖ్య సూత్రాలు అవుతాయని అన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఆపట్టుదలతో ఇప్పుడు నేను ఆసిఫాబాద్ జిల్లలో సీఐ గా పని చేస్తున్నానని అన్నారు. దీనంటికి చదువే ప్రధాన కారణమని వివరించారు. చదువు జ్ఞానాన్ని పెంచుతుందన్నారు. ప్రతీ ఒక్కరు గొప్ప లక్ష్య సాధనకై ఆలోచన చేయాలన్నారు. లక్ష్యం సాధించడానికి ఒత్తిడిని అధిగమించి ముందుకు వెళ్లాలని సూచించారు. తన మీద తనకు నమ్మకం ఏర్పడ్డప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని అన్నారు. విద్యార్థులు ఎటువంటి భయం ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా సమయంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా సీఐ లేక ఎస్ఐ నీ సంప్రదించాలని తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన సామాగ్రి అవసరం ఉంటే తమకు చెప్పాలని తెలిపారు. సుమారు 50 మందికి పరీక్ష ప్యాడ్,పెన్నులు, పెన్సిల్, రబ్బర్, చాక్మర్,వాటర్ బాటిల్ అందజేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిర్యాణి ఎస్ శ్రీకాంత్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.



# అడవి పంది దాడి లో ఇద్దరికి గాయాలు



**జననినాదం,సిర్పూర్(యు),19:** అడవి పంది దాడి లో ఇద్దరికీ గాయలైన సంఘటన బుధవారం ఉదయం సిర్పూర్ యు మండల కేంద్రంలో చోటు చేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని బజార్ వాడకు చెందిన కరాటే సావిత్రి బాయి, మున్ని బాయి ఉదయం తమ ఇంటి అనుల్లో నిమగ్నమై ఉన్నారు. అదే సమయం లో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న పంట చేన్లలో అడవి పంది శూనకాలకు తరసాపడ్డాయి. శూనకాలు వెంబదించడంతో అడవి పంది జనవసాల్లోకి వచ్చి ఇండ్లలో చొరబడి పనుల్లో నిమగ్నమై ఉన్న ఇద్దరు మహిళలల పై దాడి చేసింది. అడవి పంది దాడిలో మహిళలు తీవ్రంగా గాయపడ్డారు.అడవి పంది దాడి నుంచి కాలనీ వాసులు, కుటుంబీకులు మహిళలను కాపాడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం ఉట్నూర్ కు తరలించారు. ఉట్నూర్ ఆసుపత్రి సిబ్బంది ఆదిలాబాద్ లోని రిమ్స్కు రేఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



# ఈ నెల 21 లోగా బ్యాంక్ ఖాతా వివరాలు అందజేయాలి

**జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం**

జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి19: కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అందించే ఫీజు రియంబర్స్మెంట్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ వాటాను పొందేందుకు తమ బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్బుక్ పత్రులను ఈ నెల 21వ తేదీ లోగా జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించి ఆన్లైన్లో పొందుపర్చుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల తమ లెటర్హెడ్పై ఖాతా వివరాలతో పాటు స్టేట్మెంట్ ప్రతిని జత పరిచి అందించాలని తెలిపారు.

# ఎల్ ఆర్ ఎస్ రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి19:** లే-అవుట్ భూముల క్రమబద్దీకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఎల్ ఆర్ ఎస్-2020 పథకంలో అర్హులైన అభ్యర్థుల నుండి రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులతో అర్హులైన అభ్యర్థులలో ఈనెల 31వ తేదీ వరకు రుసుము చెల్లించే వారికి కల్పించే 25 శాతం రుసుము మినహాయింపు అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ ఆర్ ఎస్-2020 పథకంలో భాగంగా లే-అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ నెల 31వ తేదీలోగా సదరు అభ్యర్థులు 100 శాతం రుసుము చెల్లించినట్లయితే అందులో 25 శాతం రుసుము రాయితీ మినహాయింపు ఇవ్వడం జరుగుతుందని, ఈ విషయమై అర్హత కలిగిన ప్రతి అభ్యర్థులకు సమాచారం అందించి సకాలంలో రుసుము చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. రుసుము చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, చెల్లింపు గడువులో 10 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, 25 శాతం రాయితీ మినహాయింపు అవకాశాన్ని వినియోగించుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి సందర్శించి విద్యార్థులకు కల్పించిన వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో చల్లని శుద్ధమైన త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడంతో పాటు వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ. ఆర్. ఎస్. ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ నెల 21వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి పరీక్ష కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వార్డు అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గన్నారు.

# అంబరాన్ని అంటిన సంబరాలు

**సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్ శ్రేణులు**

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎస్సీ వర్గీకరణ చట్ట భద్రత రాజీవ్ యువ వికాసం బిల్లుల ఆమోదం**





**జననినాదం,తిర్యాణి,సిర్పూర్(యు)19:** ఒకే రోజు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎస్సీ వర్గీకరణ చట్ట భద్రత రాజీవ్ యువ వికాసం బిల్లులను ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిర్పూర్(యు) మండలకేంద్రంలోని జైనూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కుద్మేత విశ్వనాథ్‌రావు,తిర్యాణి మండల కేంద్రంలోని కొమురం భీమ్ చౌరస్తా వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిత్తారి సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వంఏర్పడి 15 నెలలోనే చరితాత్మక నిర్ణయాలను తీసుకుంటూ, ప్రజల క్షేమాలను కోరుతూ రాష్ట్ర అభివఅద్దే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. రాహుల్ గాంధీ సూచన ప్రకారం కులగానన చేయడం, ఎన్నో ఏండ్ల నిరీక్షణ ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన అధికారికంగా నిండు అసెంబ్లీలో ఆమోదం, బీసీ ఎస్సీ వర్గాల కళ నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క బీసీల తరఫున, యావత్ తెలంగాణ ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజీవ్ యువ వికాస పథకాన్ని మండలంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు,మండల ఉపాధ్యకుడు ఆత్రం దౌవలత్‌రావు, మాజీ వైస్ ఆత్రం ప్రకాష్,యూత్ మండల అధ్యక్షులు మెస్రం షేకు, మాజీ సర్పంచ్ మెస్రం భూావతి, ఆరిఫ్, గుణవంత్‌రావు,ఆత్రం ఓంప్రకాష్,లుపెరుమాండ్ల వెంకటేశం గౌడ్, బల్లం శంకర్, బుద్దే విజయ్, గద్దల మొగిలి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు మేడిశెట్టి శంకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పడిగేల అమర్, యూత్ మండల అధ్యక్షులు పున్నం హరీష్ కుమార్, కరిగంటి బాపు, పులి కొమురయ్య, బుద్దే చిన్నయ్య, శేఖర్, బానయ్య, అంకతి వెంకటేశం, సీడం జగన్నాథరావు, సైదం లచ్చన్న, చుంచు చంద్రమౌళి, భీమయ్య, బాపురావు, బల్లం సురేష్, చుంచు సుశాంత్, పనాస సంతోష్, అంకతి శ్రావణ్, రంజిత్, శ్రీహరి, బోడ్డ సాయికుమార్,ఈకార్యకర్తలు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్యాలఅశోక్, పలు సంఘ నాయకులు పాల్గోన్నారు.

## గంజాయి సాగుచేసిన నిల్వ ఉంచిన

# కఠిన చర్యలు తీసుకుంటాం

**తిర్యాణి ఎస్సై శ్రీకాంత్**



**జననినాదం,తిర్యాణి 19:** తిర్యాణి మండల కేంద్రంలోని నాయక పూగూడ గ్రామంలో బుధవారం రోజున తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ గాంజాయి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు చేసిన నిల్వ ఉంచిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఏ ఎస్ పి చిత్తరంజన్, రెబ్బెన సిఐ బుద్దే స్వామి ఆదేశాల మేరకు నాయకపు గూడ గ్రామానికి చెందిన మెంద్రపు చిన్నయ్య (41) వఅత్తి కూలి కులము ఎస్టి అను అతని ఇంటిలో గంజాయి ఉన్నదన్న సమాచారంతో తిర్యాణి ఎస్సై శ్రీకాంత్, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా రూ. 21 వేలు విలువ గల 875 గ్రాముల గంజాయిని స్వాధీనంచేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమాల**

# అమలుకు కార్యచరణ రూపొందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి19: వచ్చే ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమాల అమలుపై కార్యచరణ రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకఅత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో - బేటి పడావో కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో - బేటి బడవు కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేసేందుకు కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో బాలసభలు నిర్వహించాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలలో బాలికల విద్య ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థినులకు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కల్పించాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికల ఆరోగ్యం పై ప్రత్యేక దఅష్టి సారించాలని, రక్తహీనత, పోషకాహార లోపాలు గల బాలికలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థినులకు చదువులో రాణించే విధంగా కార్యక్రమాలు నిర్వహించి, మానసిక నిపుణులతో భవిష్యత్తుపై కౌన్సిలింగ్, కెరీర్ గైడెన్స్ పై వివరించాలని తెలిపారు. లైంగిక దాడులు జరగకుండా ఆత్మ రక్షణ కొరకు కరాటే శిక్షణ నేర్పించాలని, బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు జరగకుండా నిరోధించేందుకు బాలికల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో భేటీ బచావో - బేటి పడావో కార్యక్రమం నిర్వహణ కొరకు ప్రణాళిక రూపొందించి, పకడ్బందీగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, సి డి పి ఓ రేణుక, జిల్లా మహిళా సాధికారత సమన్వయకర్త శారద, సభ్యులు మమత, రాణి, సాగర్ తదితరులు పాల్గోన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి19: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లాలోని మోతుగూడ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం, నిత్యవసర సరుకుల నాణ్యత, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుద్ధమైన త్రాగునీటితో పాటు నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ 1బందీగా చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు విదల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను మెరుగుపరచాలని, నాణ్యమైన విద్యతోపాటు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, త్రాగునీటిని విద్యార్థులకు అందించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గోన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల స్వీకరణ

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి19: జిల్లాలోని వెనకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి సాధించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివఅద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 5వ తేదీలోగా ఆన్ లైన్ లో %https://tgobmms.cgg.gov.in% వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని సమీకఅత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మొదటి అంతస్తుల గల ఎఫ్ -5 లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివఅద్ధి శాఖ కార్యాలయంలో, 7989552508, 8374210341 నెంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు సజీవన్**

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి19:** జిల్లాలోని షెడ్యూల్డ్ కులములకు చెందిన నిరుద్యోగ యువత 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించే లక్ష్యంతో అందిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివఅద్ధి సంఘం కార్యనిర్వాహక సంచాలకులు సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 5వ తేదీలోగా రాయితీ రుణాలు, వివిధ రకాల వ్యాపార పెట్టుబడుల నిమిత్తం ఆన్ లైన్ లో %https://tgobmms.cgg.gov.in% వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా కేంద్రంలోని సమీకఅత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో మొదటి అంతస్తుల గల ఎఫ్ -3 లోని జిల్లా ఎస్.సి. కార్పొరేషన్ కార్యాలయంలో, 9182283832, 9502636443 నెంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దొంతి మాధవ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నర్సంపేట మార్చి 19: ఎస్ సి వర్గీకరణ పై ఆమోదం తెలిపిన తెలంగాణ శాసనసభ, నేడు బి సి లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాశనసభలో బిల్లు పెట్టి ఆమోదించడంపై సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట శాశానసభ్యులు దొంతి మాదవ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నెక్కొండ అంబేద్కర్ సెంటర్లో పాలాబీషేకం చేశారు.ఈ సందర్భంగా మండల,పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ,గత దశాబ్దాల కాలంగా బీసీలను పట్టించుకోని ప్రభుత్వాలు ఏ ఐ సి సి అగ్రనేత రాహుల్ గాంధీ అక్టోబర్ భారత్ జూడో యాత్రలో భాగంగా బీసీ కులగణన చేసి వెనుకబడిన వర్గాల వారికి 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని సూచించారని,మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావాగానే బీసీ కులగన నిర్వహించి ఈ రోజు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంట్ లో ఆమోదం తెలిపే విధంగా తెలంగాణ బీజేపీ ఎంపీలందరూ పోరాటం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్,నెక్కొండ మండల ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి భాను ప్రకాష్,మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు మాదాటి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లి సుబ్బారెడ్డి,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ముద్దరబోయిన శ్రీకాంత్,కొత్తపెల్లి రత్నం, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు మాదటి శ్రీనివాస్,మైనార్టీ నాయకులు మహ్మద్ అన్వర్, మహ్మద్ షబ్బీర్, వనం యాకంతం,దూదిమెట్ల కొమురయ్య, కిసాన్ సేల్ మండల అధ్యక్షులు,గై లక్ష్మణ్, రామారాపు రాము,గణేష్,ఉసిల్లపాటి రాజు, బోడ ప్రవీణ్ కుమార్,సురేష్,మహ్మద్ అఫ్జల్,కొమ్ము దయాకర్,కొమ్ము కార్తిక్, బొల్ల శివకుమార్,ఎం డి మధర్,ఇడెంపాక అన్వేష్,ఉప్పల లక్ష్మన్,శ్రీనివాస్, ఉడుగుల అశోక్,మచ్చ వీరన్న, మోటం కిట్టు, కొత్తకొండ గణేష్, నేతుల సారంగం, మహ్మద్ పాషా, సంపత్,రమేష్,కకర్ల దర్గయ్య గౌడ్, తల్లపెల్లి చెన్న కేశవులు గౌడ్, దుడిమెట్ల రాజు, వంగల బాబు,రావుల రాజు గౌడ్,శరత్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చల్లా వెంకటనారాయణ**



బూర్గంపాడు మార్చి 19 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చల్లా వెంకటనారాయణ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ పొదెం వీరయ్య, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవ ఆమోదం తెలిపినందుకు వెంకటనారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. ముందుగా రాజ్యాంగ ప్రధాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేసిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు వర్గీకరణ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బిల్లులో ఎస్సీలు గా ఉన్న 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా చేసి 15 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వర రెడ్డి, బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, ఐ ఎన్ టి యూ సి యూత్ జిల్లా అధ్యక్షులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, మాజీ మండల అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, బెల్లంకొండ వాసుదేవరావు, భజన ప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూపీఐ యూజర్లకు అలెర్ట్..!




## ఏప్రిల్ ఒకటి నుంచి ఈ మొబైల్ నంబర్స్ బ్యాంకు, యూపీఐ సేవలు బంద్..!

ఇటీవల కాలంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం భారీగా పెరిగింది. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరూ డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తంలో యూపీఐ ద్వారానే లావాదేవీలు జరుపుతున్నారు. గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎం తదితర యాప్స్ సహాయంతో డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాన్ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. బ్యాంకులు డిస్‌కనెక్ట్ చేసిన.. లేదంటే సరెండర్ చేసిన మొబైల్ నంబర్‌లను మార్చి 31 వరకు తొలగించాలని యాప్‌లను ఆదేశించింది.

వాస్తవానికి ఒక మొబైల్ నంబర్‌ను వరుసగా 90 రోజుల పాటు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్.. కనీసం డేటా కోసం ఉపయోగించకపోయినా ఆ నంబర్‌ను మొబైల్ కంపెనీలు డీయాక్టివ్ చేస్తాయి. ఆయా నంబర్లను ఇతరులకు కేటాయిస్తాయి. అలాంటి నంబర్ల వారంతా బ్యాంక్, ఇతర ఆర్థిక లావాదేవీల కోసం లింక్ చేసిన సమయంలో సమస్యలు ఎదురవుతాయి. ఈ క్రమంలో అలాంటి బ్యాంకు ఖాతాలను తొలగించే పని ఏప్రిల్ ఒకటి నుంచి ప్రతివారం జరుగనున్నది. ఈ మేరకు కొత్త మార్గదర్శకాలను తీసుకువచ్చింది. మార్గదర్శకాల మేరకు బ్యాంకులు డీయాక్టివేట్ అయినా, సరెండర్ చేసిన నంబర్లను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. జాబితాను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాల్సిందేనని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.గతేడాది జులా 16న స్టీరింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను అనుగుణంగా కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేసింది. బ్యాంకులు మొబైల్ నంబర్ల గురించి తెలుసుకునేందుకు డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. మార్చి 31 నాటికి బ్యాంకులతో పాటు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లు సైతం మార్గదర్శకాలు పాటించాల్సిందేనని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి వివరణాత్మక నివేదికలు పంచుకోవాల్సిందేనని చెప్పింది.అలాగే అప్‌డేట్ చేసిన మొబైల్ నంబర్ స్టిసమ్‌ని ఉపయోగించి.. నిర్వహించిన లావాదేవీల సంఖ్యను పేర్కొనాలని పేర్కొంది. ఎన్‌పీసీఐ చర్యతో సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నారు. వాస్తవానికి యూపీఐ కోసం మొబైల్ నంబర్ తప్పనిసరి. గతంలో యూపీఐకి లింక్ చేసిన నంబర్లను ఉపయోగించి ప్రస్తుతం చాలామంది లావాదేవీలు జరుపుతున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి అలా చేయడం కుదరదు. తప్పనిసరిగా యాక్టివ్‌లో ఉన్న నంబర్ మాత్రమే బ్యాంకులు పరిగణలోకి తీసుకుంటాయి. యాక్టివ్‌లో లేని నంబర్ల యూపీఐలను డీయాక్టివేట్ కానున్నాయి. మీకు తప్పనిసరిగా యూపీఐ సేవలు కావాలంటే ఆయా మొబైల్ నంబర్లను తప్పనిసరిగా రీచార్జ్ చేయాల్సిందే. లేకపోతే ఇబ్బందులు తప్పవు.

# లోకల్ బాడీ ఎన్నికల కోసం కమలం ప్లాన్

హైదరాబాద్, : భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. త్వరలో జరిగే ఈ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కానుంది. మొన్న జరిగిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడంతో రెట్టింపు ఉత్సహాంతో ముందుకు సాగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధిస్తే వచ్చే సాధారణ ఎన్నికల వరకు పార్టీ మరింత బలోపేతమవుతుందని అధిష్టానం భావిస్తుంది. పట్టు ఉన్న ప్రాంతాల్లో మరింత ఫోకస్ పెట్టి భారీ విజయాలు సాధించాలని ప్లాన్ చేస్తుంది. అందులో భాగంగానే ఇప్పటి నుంచే వివిధ సమావేశాలతో పార్టీ నేతలు బిజీ బిజీ అవుతున్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే బీజేపీ బలంగా ఉంది. ఇక్కడ ప్రతి ఎన్నికల్లో.. ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచుకుంటు వస్తుంది.. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు గెలవకున్నా.. ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. ఇటు టీచర్స్ తో పాటు పట్టభద్రుల ఎన్నికల్లో భారీ విజయం సాధించింది. ఉత్తర తెలంగాణపై ప్రభావం ఉండే ఈ ఎన్నికల్లో బీజేపీ గెలవడంతో.. పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. ఇదే ఉత్సాహాంతో.. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధించాలని.. అధిష్టానం ప్లాన్ చేస్తుంది. రిజర్వేషన్ తో సంబంధం లేకుండా.. ప్రతిచోట పార్టీని బలోపేతం చేసి.. విజయం సాధించే విధంగా క్యాడర్ ను సమాయత్తం చేస్తుంది. అందులో భాగంగానే.. ప్రతి మండలాల వారీగా




సమావేశాలు నిర్వహిస్తుంది.అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేతలకు.. బాధ్యతలు అప్పగిస్తున్నారు. అయితే.. అవసరం ఉన్న చోట? చేరికలను ప్రోత్సహించాలని నేతలు చెబుతున్నారు. ఇప్పటికే.. గ్రామ స్థాయిలో.. పార్టీ బలహీనంగా ఉంది. ఆలాంటి ప్రాంతాల్లో.. ఇతర పార్టీలకు చెందిన నేతలను చెర్పించుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు. అన్ని స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పట్టు ఉన్న ప్రాంతాల్లో మరింత పట్టు సాధించాలని వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. అదే విధంగా స్థానిక సమస్యలను ఫోకస్ పెట్టి.. ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ తరుచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిస్తున్నారు.ఇప్పటి నుంచే బీజేపీ కీలక నేతలు బూత్ వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి బూతులో 51 శాతం ఓట్లు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఎన్నికల గురించి ఆలోచించకుండా.. రేపే ఎన్నికలు ఉన్నట్లు పని చేయాలని క్యాడర్ కి నేతలు పిలుపునిస్తున్నారు.. అదే విధంగా అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన నేత వారంలో ఒక్కసారి.. కార్యకర్తల సమావేశంలో పాల్గొనాలి. ముఖ్యంగా గ్రామ స్థాయిలో ఎక్కువ పర్యటనలు ఉండే విధంగా ప్లాన్ చేశారు. ముందుగా.. సర్పంచ్ ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో.. గ్రామాల్లో బలమైన నేతల ను గుర్తించే పనిలో ఉన్నారు. పార్టీ సింబల్ లేనప్పటికీ.. పార్టీ సానుభూతిపరులు అధికంగా గెలిచేందుకు పని చేయాలని కోరుతు న్నారు. మొత్తానికి.. బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కోసం అన్ని సిద్ధం చేసుకొని.. ప్రజా క్షేత్రంలోకి దిగేందుకు సై

## రాజీవ్ యువ వికాస పథకంలో ఉద్యమ కారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**-తెలంగాణ ప్రజా కళాకారుడు సిద్దెల హుస్సేన్ డిమాండ్**



పినపాక మార్చి 19 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువకులకు సంపూర్ణ ఉపాధిని కల్పించే "రాజీవ్ యువ వికాస పథకంలో తెలంగాణ ఉద్యమకారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, తెలంగాణ ప్రజా కళాకారుడు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు సిద్దెల హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి దశ, మలిదశలో ఉద్యమకారులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఇప్పటికీ నిరుద్యోగులుగానే ఉన్నారని, గత ప్రభుత్వం ఉద్యమకారులకు ఎటువంటి ఉపాధి అవకాశాలను కల్పించలేదని, పోలీస్ కేసులే మిగిలాయని అన్నారు, కోటి ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్ రెడ్డి సర్కార్ ని, తెలంగాణ ప్రజలు భుజాన వేసుకుని అధికారంలో కూర్చుండబెట్టారు, అందులో తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, అమరవీరుల కుటుంబాలు కీలక పాత్ర పోషించాయన్నారు, గౌరవనీయులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, తెలంగాణ ఉద్యమకారుల కోసం, వారి సంక్షేమం కోసం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి రెండు వందల యాభై గజాల ఇంటి స్థలం కేటాయించాలని, యువత ఉపాధికి పెద్ద పీట వేసే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా, ఉద్యమకారులకు యూనిట్లు కేటాయించాలన్నారు. తద్వారా తెలంగాణలోని ఉద్యమకారులకు కొంతమేర ఉపాధి అవకాశాలు కల్పించినట్లు ఉంటుందని తెలియజేశారు.

# డిఎస్‌సి మరింత జాప్యం!




## ఖాళీల భర్తీకి ఎస్‌సి వర్గీకరణతో లింకు నిరుద్యోగుల్లో ఆందోళన

అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కూడా మరింత జాప్యం కానుందని సమాచారం. ఎస్‌సి వర్గీకరణతో ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం లింకు పెట్టడమే దీనికి కారణం. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో మెగా డిఎస్‌సి పైనే తొలి సంతకం చేస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చిన చంద్రబాబు, ఇప్పటి వరకు కేవలం సంతకాన్ని మాత్రం చేసిన సంగతి తెలిసింది. కానీ, ఆ తరువాత ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. మరోవైపు పాఠశాలల్లో 24 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే 16 వేలకు కుదించారు. నేడో రేపో నోటిఫికేషన్ వస్తుందంటూ ప్రభుత్వంలోని కీలక నేతలు ప్రకటనలు చేశారు. దీంతో నోటిఫికేషన్ ఖాయమని నిరుద్యోగులు భావించారు. ఈ దశలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలపై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఏక సభ్య కమిషన్ నివేదికను కేంద్ర ఎస్సి కమీషన్‌కు పంపుతామ అక్కడి నుండి అనుమతి వచ్చిన తరువాత వర్గీకరణ చేస్తామని వివరిస్తోంది. మరోవైపు వర్గీకరణ విషయం తేలిన తరువాతే డిఎస్సి, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ అంతా ఇప్పటికిప్పుడు పూర్తి కాదన్న అభిప్రాయం పరిశీలకుల్లోనూ, నిపుణుల్లోనూ వ్యక్తమవుతోంది. దీంతో డిఎస్‌సితో పాటు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కూడా వెనక్కిపోయినట్టేనని భావిస్తున్నారు.

వ్యూహం ప్రకారమేనా: రాష్ట్ర విభజన అనంతరం సుమారు 1.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. గత పదేళ్లలో వేలాదిగా ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్ట లేదు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తీసుకుని వారితో పని చేయించుకోవడంతోపాటు, ఉన్న శాశ్వత ఉద్యోగులపైనే పని భారం పెంచుతోంది. ఖాళీలను భర్తీ చేసే విషయంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు సిద్ధంగా లేని ప్రభుత్వం తెరవెనుక ఉండి నడిపిస్తున్నదే ఈ కథ అనే ఆరోపణలు ఉన్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047లో సైతం ప్రభుత్వ యంత్రాంగంలో లేటరల్ రిక్రూట్‌మెంట్, అప్రెంటిస్ విధానం, ఎ.ఐ వినియోగం వంటివి ప్రముఖంగా ప్రస్తావించారు. దీనినిబట్టి లక్షలాది ఖాళీలను భర్తీ చేసే యోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని స్పష్టం అవుతోంది. నిరుద్యోగుల ఆగ్రహాన్ని పక్కదోవ పట్టించేందుకు ప్రభుత్వం రకరకాల దారులను అన్వేషిస్తోంది. అందులో భాగంగానే వర్గీకరణను కూడా ఒక సాకుగా వాడుకుంటోందన్న అభిప్రాయాలు బలంగా వినవస్తున్నాయి.

మరిన్ని చిక్కులు!: వర్గీకరణను 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా తొలుత ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకు చాలా సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అదే విధంగా కమిషన్ నియామకం, కేవలం వంద రోజుల్లోనే నివేదిక కోరడం వంటి పలు అంశాలపైనా వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు ఉండటంతో ఈ అంశం ఇప్పటికిప్పుడు తేలే పరిస్థితి లేదు. వీరు న్యాయపరంగా ముందుకు వేళ్లే అలోచనలో ఉన్నారు. ఇదే జరిగితే మరిన్ని చిక్కులు ఎదురుకావచ్చు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం కాపులకు రిజర్వేషన్ల పేరుతో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే ఇప్పట్లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరిగే అవకాశం కనిపించడం లేదు. ఇటీవల శాసన మండలిలో మంత్రి నారా లోకేష్ ఈ ఏడాదిగానే డిఎస్సి నోటిఫికేషన్ ఇచ్చి, ఉపాధ్యాయు ల భర్తీ ప్రక్రియ కూడా పూర్తి చేస్తామని చెప్పారు. ఈ హామీ కూడా తొలి సంతకం మాదిరిగానే అభాసుపాలయ్యే అవకాశం లేకపోలేదు.

# చింటూ కోరిక



చింటూ స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం బడి వదలగానే ఇంటికి వచ్చాడు. కాళ్ళు చేతులు కడుక్కుని, అమ్మ ఇచ్చిన పాలు తాగాడు. బడిలో జరిగిన విషయాలన్నీ అమ్మకి చెప్పాడు. కాసేపు తోటి పిల్లలతో ఆడుకున్నాడు. అప్పుడు చింటూ వాళ్ల అమ్మ 'చింటూ రేపు నీ పుట్టినరోజు కదా బజారుకు వెళ్లి నీ స్నేహితులకు ఇవ్వడానికి చాక్లెట్లు, బిస్కెట్లు, నీకు కొత్త బట్టలు కొనుక్కుని వద్దాం పద" అంది.చింటూ మౌనంగా ఉండిపోయాడు. 'ఏమైంది కన్నా అలా ఉన్నావు?' అని దగ్గరికి తీసుకుని అడిగింది. 'అమ్మా! ఈసారి నా పుట్టినరోజుకి బట్టలు, చాక్లెట్లు వద్దు' అన్నాడు చింటూ. 'మరేం కావాలి?' అని అడిగింది అమ్మ చింటూని దగ్గరకి తీసుకుంటూ. 'రెండు కుండలు కావాలి అమ్మ' నసుగుతూ అడిగాడు చింటూ. 'పిల్లలు ఎవరైనా మంచి బట్టలు, ఆడుకునే వస్తువులు, సైకిలు, తినే వస్తువులు అడుగుతారు. నువ్వు కుండలు అడుగుతున్నావు ఏంటి?' అంది తల్లి. 'మొన్న మీ పెళ్లిరోజునాడు అనాథాశ్రమానికి వెళ్లి భోజనాలు పెట్టారు. ఎందుకు అలా చేస్తున్నారని నాన్నని అడిగాను. 'పదిమందికి ఉపయోగపడే పని చెయ్యాలి. ఇతరులకు సేవ చెయ్యాలి' అని చెప్పారు కదా! ఇప్పుడు నేను కూడా అలాంటి పనే చేయాలనుకుంటున్నాను' అన్నాడు చింటూ. 'అయితే ఈ కుండలెందుకు?' అడిగింది అమ్మ అయోమయంగా ముఖంపెట్టి.రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి కదా అమ్మ. మా తరగతి గది ముందు, పంచాయితీ ఆఫీసు దగ్గర కుండతో నీళ్లుపెట్టి దాహం తీర్చాలి అనుకుంటున్నాను' అన్నాడు చింటూ. చింటూకి వచ్చిన గొప్ప ఆలోచనకు పొంగిపోయింది తల్లి. మర్నాడు చింటూ స్కూలుకి కొత్త బట్టలు వేసుకుని రెండు కుండలు పట్టుకుని వెళ్లాడు.సత్యం మాష్టారుకి విషయమంతా వివరించి చెప్పింది చింటూ తల్లి. 'పిల్లలు తల్లి దండ్రులను అనుకరిస్తారు. ఇతరులకు సేవ చేయాలన్న మీ ఆలోచన చింటూ కూడా ఒంటబట్టించుకున్నాడు. అని తల్లిని మెచ్చుకుని చింటూకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు సత్యం మాష్టారు. ఎండాకాలంలో చింటూ ఏర్పాటు చేసిన కుండలో చల్లని నీటిని తాగి ఆనందించడమే కాదు మిగిలిన పిల్లలు కూడా చింటూ బాటలో నడిచారు. పెద్దలు అభినందించారు.

# రేవంత్ అసమర్ధ పాలనకు నిదర్శనం ఈ బడ్జెట్

**-తెలంగాణ ప్రజలను నట్టేట ముంచిన బడ్జెట్**
**-మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



మంథని ప్రతినిధి,మార్చి 19: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన రెండో బడ్జెట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్ధ పాలనకు నిదర్శనమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ముందు వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గారంటీలను తుంగలో తొక్కి కాంగ్రెస్ కార్యకర్తల జేబులు నింపడానికి ప్రజాధనం దుర్వినియోగం చేయడానికి బడ్జెట్ లో కేటాయింపులు చేయడం సిగ్గు చేటన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చిన ఆరు గారంటీలను 500 రోజులైనా అమలు చేయకపోగా అందులో పేర్కొన్న అంశాలను తప్పుదారి పట్టించే ప్రక్రియకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. బడ్జెట్ లో రూ. 6 వేల కోట్లు కేటాయించి వాటిని విద్యార్థులకు బదులు కాంగ్రెస్ కార్యకర్తలకు పప్పు, బెల్లంలా పంచిపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. రూ. 2 లక్షల 90 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టిన గత సంవత్సరంలోనే రూ. 70 వేల కోట్ల లోటుందని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ప్రకటించి ఇప్పుడు రూ. 3 లక్షల 5 వేల కోట్లకు ఎలా పెంచారని, గత సంవత్సరంతో పోల్చితే ఇప్పుడు ఆదాయం ఎలా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. కొత్తగా రూ. 500 కోట్ల పెట్టుబడి పెట్టడానికి కూడా తన ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని బేల మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి ఆరు గారంటీలను అమలు చేయడం మానుకుని రూ. 6 వేల కోట్లు కార్యకర్తలకు వంచడానికి బడ్జెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. తెలంగాణ అక్కాచెల్లెళ్లకు ప్రతినెలా ఇస్తా అన్న రూ. 2500 కు బడ్జెట్ లో కేటాయింపులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా అబద్దాల పునాదుల మీద చేస్తున్న పరిపాలనకు ఫుల్ స్టాప్ పెట్టి వాస్తవంలోకి రావాలని కోరారు. అప్పు చేసి పప్పుకూడు రాష్ట్రనికి ముప్పని రేవంత్ రెడ్డి చెప్తే ఇక అతను అబద్దాలను మానేసి, అప్పులకు తావులేకుండా అసలు సిసలు బడ్జెట్ ప్రవేశ పెడతాడని ఆశించిన ప్రజలకు నిరాశయే ఎదురైందాన్నారు. అంకెల గారడీతో ఆరు గారంటీలకు ఎగనామం పెట్టి, రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను, ఆటో డ్రైవర్లను, గిగ్ వర్కర్లను, మహిళలను, ఉద్యోగులను సబ్బండ వర్గాలను నిండా ముంచిన బడ్జెట్ అని ఆయన విమర్శించారు.

# సినిమాలకి గుడ్ బై చెప్పిన నటి హేమ



%ఎజుఫీూ%ఎ నటి హేమ మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్. ఎన్నో సూపర్ హిట్ చిత్రాలలో తన నటనతో ప్రేక్షకులని ఎంతగానో అలరించింది. ఒకప్పుడు హేమ అంటే ఆమె నటించిన క్యారెక్టర్స్ గుర్తుకు వస్తాయి. ఇప్పుడు అయితే డ్రగ్స్ కేసూ.. ఇతర వివాదాలు.. అవి ఇవీ గుర్తొస్తుంటాయి . హేమ 'అతడు' సినిమాలో బ్రహ్మానందంతో కలిసి చేసిన కొన్ని సీన్స్‌కి జనాలు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకున్నారు. నటి హేమ ఎన్ని సినిమాలు చేసినా కూడా.. అతడు సినిమా గురించే అడుగుతుంటారు. అయితే అలాంటి పాత్రలు ఎప్పుడుచేస్తారు హేమా గారూ అని అడగగా, అలాంటి పాత్రలు కాదు.. అసలు ఇకపై ఎలాంటి పాత్రలు చేయనంటూ పెద్ద షాక్ ఇచ్చింది నటి హేమ.

నేను 14 ఏళ్ళ వయసు నుంచి కష్టపడుతున్నా. ఇకపై విశ్రాంతి తీసుకుంటూ ఎంజాయ్ చేయాలనుకుంటున్నా అని చెప్పుకొచ్చింది . జీవితాంతం కష్టపడుతూనే ఉండాలా, కొంచెం చిల్ అవ్వాలి కదా అందుకే చిల్ అవుతున్నా. సినిమాలకు, నటనకు దూరంగా ఉండాలని డిసైడ్ అయ్యాను. బాహుబలిలో శివగామి లాంటి పాత్ర ఇచ్చినా చేయను అని హేమ తేల్చి చెప్పింది. ఒకవేళ మళ్ళీ నాకు నటనపై ఆసక్తి కలిగితే అప్పుడు ఆలోచిస్తానంటూ హేమ స్పష్టం చేసింది. ఇప్పుడు హేమ ఎంజాయ్ చేయాలనే మూడ్‌లో ఉంది. ఆ కారణంగానే సినిమాలకి దూరం అవ్వాలని డిసైడ్ అయింది. అయితే హేమ ఎంజాయ్‌మెంట్ కోసమే సినిమాలు మానేస్తుందా, లేకుంటే వేరే కారణం ఏదైన ఉందా అనే దాని గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. వివాదాల వలన దూరం అవుతుందేమో అని కొందరు ముచ్చటించుకుంటున్నారు. డ్రగ్స్ కేసు ఇష్యూ తరువాత నటి హేమ మీడియాకి కాస్త దూరంగానే ఉంటున్నారు. నటి హేమ.. ఇప్పటివరకూ తెలుగు, తమిళ, మలయాళం, హిందీ భాషల్లో కలిపి దాదాపు 500పైగా చిత్రాల్లో నటించింది. హేమ అసలు పేరు కృష్ణవేణి కాగా, ఈమెది అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు. సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చిన హేమ.. సీరియల్స్‌లో కూడా నటించింది. 1989లో 'చిన్నారి స్నేహం' సినిమాలో చిన్న పాత్రలో నటించిన ఆమె చివరిగా 2023లో వచ్చిన 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' సినిమాలో కనిపించింది. అతడు, దేశముదురు, పెళ్లైన కొత్తలో, శ్రీరామదాసు, భగీరథ, మల్లీశ్వరి లాంటి చిత్రాలు హేమకి మంచి పేరు తీసుకురావడమే కాక జనాలకి దగ్గర చేశాయి.





# చేయనని చెప్పనుకానీ.. అలా అయితే చేస్తా..




'అర్జున్‌రెడ్డి' సినిమాలో కథానాయిక షాలినీ పాండే పోషించిన 'ప్రీతి' పాత్రను ఇష్టపడని ప్రేక్షకుడు ఉండడు. ఓ విధంగా ఆ సినిమా విజయంలో ఆ పాత్ర ప్రభావం చాలా ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర షాలినీకి రాలేదనే చెప్పాలి. అయితే.. రీసెంట్‌గా ఆమె 'డబ్బా కార్టెల్' వెబ్‌సిరీస్‌లో నటించారు. ఆ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్. అందులో బలమైన మహిళగా కనిపించి, ప్రశంసలందుకుం టున్నది షాలినీ పాండే. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మరోసారి 'అర్జున్‌రెడ్డి' లాంటి సినిమాలో ప్రీతి తరహా పాత్ర చేయాల్సివస్తే చేస్తారా?' అని ఓ విలేకరి అడగ్గా.. 'నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో చేసిన సినిమా అది. ఇప్పుడు ఆ పాత్ర గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తుంది. ఆ పాత్రను ఇంకాస్త బలంగా రాయొచ్చేమో అనుకుంటున్నా. మరోసారి ఆ తరహా పాత్ర వస్తే చేయనని చెప్పను కానీ.. దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకొని అప్పుడు చేస్తా. అంతేకాదు, అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి ఇంకాస్త భిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తా.' అంటూ చెప్పుకొచ్చింది షాలినీ పాండే.

# అలనాటి అందాల నటుడు, ఎవర్ గ్రీన్ సోగ్గాడు శోభన్ బాబు


## –నేడు ఆయన వర్ధంతి





( పెండ్యాల రామ్ కుమార్, మంథని ): కనురెప్ప మరల్చలేని అందం శోభన్ బాబు సొంతం. ఎన్నో మరిచిపోలేని పాత్రలకు జీవం పోసి, తెలుగు వారి గుండెల్లో మహారాజుగా వెలుగొందింది ఆయన రూపం. ఇద్దరు భార్యల మధ్యలో నలిగిపోయే పాత్రలో నటించి మహిళా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన సోగ్గాడు ఆయన. ప్రేమకథలకు రొమాంటిక్ హీరోగా, మాస్, క్లాసికల్ పాత్రలకు నిర్వచనంగా నిలిచారు శోభన్ బాబు. ట్రాయాంగిల్ లవ్ స్టోరీలకు ట్రెండ్ సెట్టర్ గా నిలిచిన అరుదైన హీరో శోభన్ బాబు. నేడు ఆ అందాల సోగ్గాడి జయంతి. జనవరి14,1937లో కృష్ణా జిల్లా చిన నందిగామలో పుట్టిన శోభన్ బాబు అసలు పేరు ఉప్పు శోభనా చలపతి రావు. సామాన్య రైతుల కుటుంబంలో జన్మించిన ఈయన హైస్కూల్లో చదివిన రోజుల్లోనే నాటకాలపై ఆసక్తిని పెంచుకున్నారు. మద్రాసు లా కోర్సులో చేరినప్పటికీ నటన పైన ఆసక్తితో సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఉదయం కాలేజీకి వెళ్ళి, మధ్యాహ్నం నుండి స్టూడియోల వెంట తిరిగేవారు.. అప్పుడే తన పేరును శోభన్ బాబుగా మార్చుకున్నారు. 1959లో శోభన్ బాబు తన మొదటి సినిమా.. 'దైవబలం' చేశారు. ఎన్టీయార్ తో కలిసి చేసిన ఈ సినిమా విజయవంతం కాలేదు. దాని తర్వాత నెక్స్ట్ ఏడాదే భక్త శబరి చిత్రంలో మునికుమారుడుగా నటించారు. ఆ సినిమా సక్సెస్ కావడంతో .. సినీ పరిశ్రమకు, తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు శోభన్ బాబు. తర్వాత వచ్చిన చిన్న చిన్న అవకాశాలను సైతం సద్వినియోగం చేసుకుంటూ తెలుగు టాప్ హీరోల్లో ఒకరిగా నిలిచారు. నర్తనశాల, వీరాభిమన్యు, బంగారు పంజరం, మనుషులు మారాలి, దేవాలయం, సంపూర్ణ రామాయణం, బుద్ధిమంతుడు సినిమాలు శోభన్ బాబుకు మంచి పేరును తెచ్చిపెట్టాయి. దేవత, పండంటి కాపురం, కార్తీక దీపం సినిమాలతో శోభన్ బాబు మహిళా ప్రేక్షకులకు ఆరాధ్య కథానాయకుడుగా మారిపోయారు.హీరోగానే కెరీర్ ముగించిన శోభన్ బాబునటభూషణ, సోగ్గాడు, ఆంధ్రా అందగాడు బిరుదులను సొంతం చేసుకున్న శోభన్ బాబు సినీ ఫీల్డ్ లోనూ వెరీ హంబుల్ మ్యాన్ అనే పేరును తెచ్చుకున్నారు. ఎప్పుడూ ఎటువంటి కాంట్రవర్సీలకు పోకుండా%ో%.అందరితోనూ కలిసిపోయే ఆయన సినిమాలకు దూరం అయిన తర్వాత మాత్రం ఎవరికీ కనిపించకుండా%ో% కుటుంబానికే పరిమితమయ్యారు. హీరోగానే తన కెరీర్ ముగించారు. సహాయక పాత్రల జోలికి పోలేదు. సినీ జీవితానికి స్వస్తి చెప్పిన తర్వాత శోభన్ బాబు శేష జీవితాన్ని అందరికీ దూరంగా మద్రాసులో తన సొంత ఇంటిలోనే గడిపారు. మార్చి 20, 2008న కన్నుమూశారు. శోభన్ బాబు మనిషిగా మరణించినా.. నటుడిగా.. ఉత్తమ వ్యక్తిగా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ఇప్పటికీ ఎవర్ గ్రీన్ సోగ్గాడిగానే నిలిచి ఉన్నారు.

# సుకుమార్ సినిమాలో విలన్‌గా?



బాలీవుడ్ బాద్షా షారుక్‌ఖాన్‌తో అగ్ర దర్శకుడు సుకుమార్ ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారని, ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయని గత కొద్ది నెలలుగా ముంబయి సినీ సర్కిల్స్‌లో గాసిప్స్ వినిపిస్తున్నాయి.

షారుక్‌ను నెగెటివ్ షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో ప్రజెంట్ చేస్తూ సుకుమార్ ఓ స్క్రిప్ట్ చేశారని, రూరల్ పొలిటికల్ కథాంశంతో కూడిన ఈ సినిమాలో షారుక్ ఖాన్ పాత్ర రా అండ్ రస్టిక్‌గా సాగుతుందని, ఇందులో సామాజిక అంతరాలను కూడా చర్చించారని ఆ గాసిప్స్ సారాంశం. అయితే ఇందులో నిజానిజాలు ఎలా ఉన్నా..ఈ సూపర్ కాంబో సాకారమైతే చూడాలని అభిమానులు మాత్రం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్‌లో ఎదురులేని హీరోగా ఉన్నారు షారుక్‌ఖాన్, ఇక 'పుష్ప-2'తో భారతీయ సినిమాలో కొత్త చరిత్ర సృష్టించారు సుకుమార్. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ అంటే ఇక అభిమానులకు పండగే. బాక్సాఫీస్‌కు కాసుల వర్షమే అంటున్నారు. అయితే ప్రస్తుతం సుకుమార్, షారుక్‌ఖాన్‌లకు ఉన్న సినిమా కమిట్‌మెంట్స్ దృష్ట్యా మరో రెండుమూడేళ్ల తర్వాత వారి కాంబినేషన్‌లో సినిమా కార్యరూపం దాల్చే అవకాశముందని అంటున్నారు.


# చిరంజీవికి గట్టిగా ముద్దిచ్చిన మహిళా అభిమాని..



మెగాస్టార్ చిరంజీవికి డై హార్డ్ ఫ్యాన్ కాగా, ఆయన తన టెస్లా కారుకు 'మెగాస్టార్' అని వచ్చేలా నంబర్ ప్లేట్ వేయించుకున్నాడు. టోటల్ టెక్సాస్ లో చూస్తే%ో% ఈ నంబర్ ప్లేట్ ఉన్న కారు ఇదొక్కటే ఉంటుంది. మనోడు చిరంజీవిపై ఎప్పటికప్పుడు తన అభిమానం చూపిస్తూ ఉంటారు. ఇక చిరంజీవి రీసెంట్‌గా యూకే పార్లమెంట్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకోవడానికి లండన్ వెళ్లారు. ఆయన హీత్రూ విమానాశ్రయంలో దిగగానే, అభిమానులు, తెలుగు ప్రవాసులు చిరుకి ఘన స్వాగతం పలికేందుకు అక్కడికి భారీగా చేరుకున్నారు. అయితే ఒక మహిళా అభిమాని చిరంజీవి బుగ్గపై ముద్దు పెట్టుకోవడం ద్వారా తన అభిమానాన్ని చాటుకుంది.. ఇప్పుడు ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిరంజీవిని ముద్దు పెట్టుకున్న మహిళ కుమారుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, "చిన్నప్పుడు, నేను చిరంజీవిని కలవాలని పట్టుబట్టేవాడిని. ఈరోజు, నా తల్లిని అతనిని కలవడానికి తీసుకెళ్లాను" అని రాసుకొచ్చారు. ఈ పిక్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. అయితే మహిళా అభిమాని ముద్దు పెడుతున్న సమయంలో చిరు చిన్న చిరునవ్వు నవ్వడం ఫొటోలో గమనించవచ్చు. ఇక బుధవారం సాయంత్రం చిరంజీవిని యూకే పార్లమెంట్‌లో జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నారు. నాలుగు దశాబ్దాలుగా సినిమా, సామాజిక సేవకు ఆయన చేసిన కృషికి గాను ఆయనకి ఈ గుర్తింపు దక్కింది.

తరాలు మారిన మెగాస్టార్ క్రేజ్ ఏమాత్రం తగ్గదు. ఆయన సినిమాలు ఎప్పటికీ ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతూనే ఉంటాయి. మెగాస్టార్ చిరంజీవి జర్నీ దాదాపు ఐదు దశాబ్దాలుగా సాగుతుంది. చిరంజీవి 1978లో నటుడిగా మారారు. పునాదిరాళ్లు చిత్రంలో నటించి నటుడిగా మారిన చిరంజీవి ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు. మెగాస్టార్‌గా ఇండస్ట్రీని ఏలుతున్నారు. ఇప్పటికీ చిరంజీవి యువకులకి పోటీగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నారు. ఇక ఆయన అభిమాన గణం రోజు రోజుకి పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఆయనకి మన ఇండియాలోనే కాదు విదేశాలలోను భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమెరికాలో ఉన్న డాక్టర్ ఇస్మాయిల్ సుహైల్ పెనుకొండ

# ఫూలన్ దేవిపై సినిమా.. ఓటీటీపై విమర్శలు గుప్పించిన దర్శకుడు శేఖర్ కపూర్





బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు శేఖర్ కపూర్ తన సినిమాలోని సన్నివేశాలను తన అనుమతి లేకుండా కత్తిరించడంపై ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోపై విమర్శలు గుప్పించారు. శేఖర్ కపూర్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం "బండిట్ క్వీన్". భారతీయ డాకాయిట్ (బందిపోటు) ఫూలన్ దేవి జీవిత చరిత్ర ఆధారంగా వచ్చిన ఈ చిత్రం 1994లో విడుదలైంది విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో ఫూలన్ దేవి పాత్రలో సీమా బిస్వాస్ నటించారు. అయితే ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలకు సెన్సార్ బోర్డ్ అభ్యంతరం చెప్పింది. కొన్ని ప్రాంతల్లో అయితే ఈ సినిమాను బ్యాన్ కూడా చేశారు. ఇదిలావుంటే ఈ చిత్ర ప్రస్తుతం ఓటీటీ వేదిక అయిన అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమాలో చాలా సన్నివేశాలను ప్రైమ్ కత్తిరించింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న శేఖర్ కపూర్ ప్రైమ్ వీడియోపై విమర్శలు గుప్పిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతున్న బండిట్ క్వీన్ సినిమా నేను తీసిన సినిమా కాదు. ఈ చిత్రం గుర్తించలేనంతంగా మారిపోయింది. నా అనుమతి లేకుండా కత్తిరించారు. నా పేరుతో ఉన్న సినిమానా అని చూసి షాక్ అయ్యాను. నాకు తెలికుండా సెన్సార్‌షిప్ చేయడం ఏంటి. హాలీవుడ్ సినిమాలకు లేదా క్రిస్టోఫర్ నోలన్ చిత్రాలను ఇలానే ఆయన అనుమతి లేకుండా కత్తిరిస్తారా అంటూ శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఒక దర్శకుడు, ఎడిటర్ ఎడిటింగ్ సమయంలో ఎంత కష్టపడతారో, రాత్రింబవళ్లు ప్రతి కట్ గురించి వాదిస్తూ గడుపుతారో నాకు ఇప్పటికీ గుర్తుంది. రేణు సలూజాతో కలిసి 'బండిట్ క్వీన్' ఎడిటింగ్‌లో నెలల తరబడి గడిపాను. ఇప్పుడు ఎవరో ఒకరు దీన్ని వారి అవసరాల కోసం నిర్లక్ష్యంగా కత్తిరిస్తున్నారు అంటూ తెలిపాడు. ఈ వివాదంపై దర్శకుడు హన్సల్ మెహతా కూడా స్పందిస్తూ, భారతీయ సినిమాలను ఇలా చిన్నచూపు చూడటం బాధాకరమని పేర్కొన్నారు

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem (Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.